ప్రజాశక్తి

ఆదివారం 2 ఏప్రిల్ 2023

5

విజయనగరం



ఆస్తి పన్ను వసూళ్లలో నెల్లిమర్ల ఫస్ట్

ప్రజాశక్తి-బొబ్బిలి

ఆస్తిపన్ను వసూళ్లలో నెల్లిమర్ల, బొబ్బిలి మున్సిపాలిటీలు మొదటి, రెండో స్థానాల్లో నిలిచాయి. బొబ్బిలి మున్సిపాలిటీలో 11,979 నివాస, వాణిజ్య భవనాలు నుంచి రూ.4.22 కోట్ల ఆస్తిపన్ను డిమాండ్ ఉండగా, రూ.3.80 కోట్లు వసూలు చేసి జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. నెల్లిమర్ల మున్సిపాలిటీ 5,208 నివాస, వాణిజ్య భవనాల నుంచి రూ.కోటి 25 లక్షల డిమాండ్ ఉండగా రూ. కోటి 26 లక్షలు వసూలు చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాజాం నగర పంచాయతీలో 11,622 నివాస, వాణిజ్య భవనాలుండగా రూ.2.55 కోట్లకు రూ.2.18 కోట్లు వసూలు చేసి మూడో స్థానంలో నిలిచింది. విజయనగరం కార్పొరేషన్‌లో 63,105 నివాస, వాణిజ్య భవనాలుండగా రూ.43.49 కోట్లకు రూ.34.75 కోట్లు వసూలు చేసి ఆఖరి స్థానంలో నిలిచింది. జిల్లాలో ఆస్తిపన్ను రూ.51.52 కోట్ల డిమాండ్ ఉండగా రూ.42.01 కోట్లు వసూలైంది. సచివాలయ, మున్సిపల్ సిబ్బంది కృషి, ప్రజల సహకారంతో ఆస్తిపన్ను వసూలు చేశామని బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు చెప్పారు.

తారకరామతీర్థసాగర్ ప్రాజెక్టు

పరిహార(స)ం

- ప్యాకేజీ, పునరావాసానికి నోచని టిటిపిఆర్ నిర్వాసితులు
- ఏటా మొక్కుబడి కేటాయింపులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

తోటపల్లి, తారకరామతీర్థసాగర్ (టిటిపిఆర్) నిర్వాసితుల పరిహారం, పునరావాసం పరిహాసంగా మారింది. భూములు, ఊళ్లు కోల్పోయిన బాధితులకు దశాబ్దాలు గడిచినా నష్టపరిహారం, పునరావాసం అందని పరిస్థితి. భూసేకరణ విషయంలో పాలకులు 'యేరు దాటే వరకు ఓడ మల్లన్న, ఒడ్డుకు చేరాక బోడిమల్లన్న' అన్న చందంగా వ్యవహరించడమే ఇందుకు కారణం. నిర్వాసిత సమస్యలను అధ్యయనం చేసేందుకు గత ఏడాది జులైలో ఆర్అండ్ఆర్ కమిషనర్ జిల్లాలో పర్యటించినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదు.

దీంతో, నిర్వాసితులంతా నిలువ నీడలేక, వ్యవసాయ భూములకూ దూరమై... బతుకు బారమై తల్లడిల్లుతున్నారు. జిల్లాలో నాలుగు మండలాల్లో 24వేల ఎకరాలకు సాగునీరు, విజయనగరం వాసులకు తాగునీటి అవసరాలు తీర్చేందుకు 2004లో రామతీర్థసాగర్ నిర్మాణం చేపట్టిన విషయం విధితమే. పునరావాసానికి ఒక్కో కుటుంబానికి రూ.5.5 లక్షలు చొప్పున సుమారు రూ.77 కోట్లు అవసరం కానుంది.

పడాలపేట, ఎటి అగ్రహారం వాసులకు వన్‌టైన్ సెటిల్‌మెంట్‌కు రూ.43.74 కోట్లు అవసరం కానున్నట్టు అధికారులు అంచనా రూపొందించారు. కోరాడపేట వాసులకు పునరావాసం నిమిత్తం రూ. 54.66 కోట్లు వెరసి మొత్తం రూ.175.4కోట్లు అవసరం ఉన్నట్టు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఆచరణలో ఈ ఏడాది కేటాయించింది కేవలం రూ.10కోట్లు మాత్రమే. ఈ నిధులు ఏమేరకూ సరిపోయే పరిస్థితి లేదు.

2003లో తోటపల్లి నిర్వాసితుల ఇంటి నిర్మాణానికి అప్పట్లో మంజూరు చేసిన రూ.53వేలతో ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. ఇప్పటికీ నిర్వాసిత కాలనీలు మొండిగోడలతోనూ, పునాదుల స్థాయిలోనే ఉన్నాయి. ఇందుకు కనీసం రూ.5 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు చాలా కాలంగా కోరుతున్నారు. భూసేకరణ చట్టం ప్రకారం భూసేకరణ నాటికి తాత్కాలికంగా వలస వెళ్లిన వారికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కూడా కోరుతున్నారు. నందివానివలస గ్రామస్తులకు ఇంకా పరిహారం చెల్లించలేదు. బాసంగి మిగులు భూములకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. బంటువానివలస, పిన్నింటి రామినాయుడువలస వారికి పట్టాలు ఇచ్చినా, స్థలాలు చూపలేదు. కోటవానివలస గ్రామస్తులకు రోడ్డు సౌకర్యం కల్పించలేదు. పిఆర్ఎన్‌వలసలో మౌలిక సదుపాయాలు లేవు. నిర్వాసిత గ్రామాల్లోని ఆలయాలకు నష్టపరిహారం, తమకు ప్యాకేజీలు కూడా ఇవ్వలేదంటూ కొంతమంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అర్అండ్ఆర్ కింద రూ.120 కోట్లు అవసరమౌతుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఇందులో కేవలం ఇళ్ల నిర్మాణం కోసమే రూ.106.8 కోట్లు అవసరం కానుంది. ఆర్అండ్ఆర్‌కు ప్రభుత్వం కేవలం రూ.3.96కోట్లు మాత్రమే కేటాయించింది.

వైద్య సేవలపై నిర్లక్ష్యం వద్దు

ఆసుపత్రులకు అవసరమైన వసతులన్నీ కల్పిస్తాం : జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం

అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రికి వచ్చిన వారికి ముందుగా వైద్యం అందించాలని, పేషెంట్‌ను చూడకుండానే రిఫర్ చేయకూడదని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పాము కాటు, విషం తీసుకున్నవారు, ప్రమాదాల బారిన పడిన వారు ప్రాణాపాయ స్థితిలో వచ్చిన వారికి తక్షణ వైద్యం చేసే పరిస్థితి ఉండాలని అన్నారు. శనివారం జిల్లా పరిషత్ చైర్మన్ ఛాంబర్ లో ఆసుపత్రులలో మౌలిక సదుపాయాలు, సేవలపై వైద్యాధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒపి, శస్త్ర చికిత్సలు పెరగాలని, రిఫెరల్ కేసులు తగ్గాలని అన్నారు. సర్వజన ఆసుపత్రిలో సిటి స్కాన్, ఎంఆర్ఐ ప్రస్తుతం పని చేయడం లేదని తెలుస్తోందని అడిగారు. ఎన్ఆర్ఐ హాస్పిటల్ పిపి మోడ్ లో ఈ ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేసిందని, రిపేర్ కోసం వారికి తెలియజేసామని, త్వరలో మరమ్మతులు అవుతాయని మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ లీల తెలిపారు. మత్తు వైద్యుల పోస్టులు తక్షణమే ఘోషా కు, సర్వజన ఆసుపత్రికి ఇద్దరి అవసరం ఉందని కోరారు. సూపర్ స్పెషాలిటీ, కీమో, రేడియేషన్ వంటి వాటి కోసం మాత్రమే రిఫర్ చేస్తున్నామని తెలిపారు. పోస్టులు ఖాళీ ఉంటే అంతర్గతంగా సర్దుబాటు చేసుకోవాలని, డిసిహెచ్ఎస్‌కు తెలిపారు. ఘోషాలో థియేటర్‌లో రోగులకు ఉపయోగించేందుకు ఆకుపచ్చని క్లాత్ సుమారు వెయ్యి మీటర్లు అవసరం ఉందని హెచ్ఒడి డాక్టర్ అరుణ కుమారి కోరగా దివిస్ కంపెనీ వారితో చైర్మన్ మాట్లాడి సిఎస్ఆర్ కింద రూ.5 లక్షలు ఆసుపత్రికి కేటాయించాలని కోరారు. అందుకు వారు అంగీకరించారు. జిజిహెచ్ లో వైద్యులు, రోగుల కోసం ఒక క్యాంటీన్ ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ కోరగా డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి తో మాట్లాడి జిల్లా సమాఖ్య వారితో కాంటీన్ ఏర్పాటు చేయించి సూచించారు. రెండు చోట్ల రక్షిత తాగు నీరు ఏర్పాటు చేయాలని వైద్యులు కోరగా ఆర్‌డబ్లుఎస్ ఎస్ఇ ఉమాశంకర్‌తో మాట్లాడి రెండు చోట్ల రెండు ఆర్ఒ ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలనిసూచించారు. ఆసుపత్రి ఆధునీకరణలో సిసి కెమెరాలను తీసివేశారని, మళ్లీ ఏర్పాటు చేయలేదని ప్రిన్సిపల్ తెలిపారు. వెంటనే ఏర్పాటు చేయాలని ఇఇ సత్యప్రభాకర్‌కు ఆదేశించారు.

సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ డాక్టర్ అశోక్ కుమార్, డిఎంహెచ్ఒ డాక్టర్ రమణ కుమారి, డిసిహెచ్ఎస్ గౌరీ శంకర్, మెడికల్ కాలేజీ ప్రొఫెసర్లు, సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షపునీరు

బొబ్బిలిలో గాలివాన బీభత్సం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో శనివారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వర్షం కురవడంతో రోడ్లపైనుంచి వర్షపునీరు ప్రవహించింది. గాంధీబొమ్మ రోడ్డు, పూల్‌బాగ్ రోడ్డుపైకి వర్షపునీరు ఉప్పొంగి ప్రవహించింది. రాజా కళాశాల, సంస్థానం ఉన్నత పాఠశాల రోడ్లపై నీరు చేరింది. దీనివల్ల గోతులు కనిపించకపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. గాలులు వేయడంతో 17వ వార్డులో భూములవీధిలో కొబ్బరి చెట్టు విద్యుత్తు తీగలు, స్లాబ్ ఇంటిపై పడింది. ఇంటిపై కొబ్బరి చెట్టు కూలిన సమయంలో విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం సంభవించలేదు. అకాల వర్షాలతో పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బొండపల్లి ఎంపిపి కారు బోల్తా

తప్పిన ప్రాణాపాయం

ప్రజాశక్తి-బొండపల్లి

బోల్తా పడిన కారు

కారుబోల్తా పడిన సంఘటనలో బొండపల్లి ఎంపిపి చల్ల చలంనాయుడికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం మండలంలోని అంబటివలస జాతీయ రహదారి వద్ద చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బొండపల్లిలో వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం ముగిసిన అనంతరం ఎంపిపి చలంనాయుడు విజయనగరం బయల్దేరారు. అంబటివలస సమీపంలో విజయనగరం నుంచి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఎంపిపి తన వాహనాన్ని ఎడమవైపునకు మళ్లించే క్రమంలో చెట్టును కారు ఢీకొని బోల్తా పడింది. కారు అద్దాలను ఆయన పగులకొట్టి బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి.

11న జెడ్‌పి సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 11న జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశాన్ని జెడ్‌పి సమావేశ మందిరంలో చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు సిఇఒ ఎం.అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్తు సభ్యులు, ప్రభుత్వ శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుంటాం

కార్మిక సంఘాల నాయకులు • స్టీల్‌ప్లాంట్ కార్మికుల పోరాటానికి మద్దతుగా ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం 700 రోజులకు చేరినా సందర్భంగా కలెక్టరేట్ వద్ద సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో సంఘీభావాన్ని తెలియజేస్తూ శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు మాట్లాడుతూ గత 26నెలలుగా జరుగుతున్న పోరాటం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోగల్గిందని అన్నారు. ఇప్పటి వరకూ ఒక్క శాతం కూడా విశాఖ స్టీల్ వాటాలు అమ్మకుండా నిలవరించినందుకు కార్మికులు, ఉద్యోగులు, కార్మిక సంఘాలకు జేజేలు పలికారు. 32మంది ప్రాణ త్యాగం చేసి వేలాది మంది ప్రజలు భూములు త్యాగం చేస్తే వచ్చిన ఉక్కు ఫ్యాక్టరీని ఇప్పుడు కేంద్ర బిజెపి ప్రభుత్వం దొడ్డిదారిన విక్రయించేందుకు కుట్ర పన్నిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు బిడ్ నెంబరు 1గా వచ్చిన రాజస్థాన్ మైన్స్ విశాఖ స్టీల్ ప్లాంట్ కొనకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుపడిందన్నారు. కోవిడ్‌ను అడ్డంపెట్టుకొని కార్మికులకు ప్రమోషన్లు పూర్తిగా ఆపేశారన్నారు. సమస్యలను పరిష్కరించ వలసిన డైరెక్టర్ పర్సనల్ రెండేళ్ల నుంచి లేరని, ఉత్పత్తి చూడాల్సిన డైరెక్టర్ అపరేషన్‌ను ఎందుకు కేంద్ర ప్రభుత్వం నియమించలేదని ప్రశ్నించారు.

రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసిపి కేంద్ర ప్రభుత్వ చర్యలను వ్యతిరేకించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇద్దరూ కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను బలహీనపరచి పోస్కో, అదానీలకు కట్టబెట్టాలని కుట్ర చేస్తున్నాయన్నారు. విశాఖ స్టీల్ అమ్మకాన్ని వెంటనే ఆపాలని, నూరు శాతం విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు యుఎస్ రవికుమార్, పట్టణ ఉపాధ్యక్షులు ఆర్.శంకర్ రావు, ఎఐటియుసి నాయకులు పి.అప్పారావు, శ్రీను,నాయుడు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్. ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

నగరానికి చెందిన గురునారాయణ కళాపీఠం.. ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాధవ పెద్ది సురేష్‌కు సంగీత స్వర సామ్రాట్ బిరుదును ప్రదానం చేసింది. ఆ బిరుదును శనివారం ఆనందగజపతి ఆడిటోరియంలోడిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆయనకు అందజేశారు. - ప్రజాశక్తి, విజయనగరం కోట

మనం- మన గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి -విజయనగరం కోట

స్థానిక గురజాడ స్మారక జిల్లా కేంద్రంలో 'మనం-మన గ్రంథాలయం' కార్యక్రమాన్ని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మండపాటి శేషగిరిరావు శనివారం ప్రారంభించారు. ముందుగా గ్రంథాలయంలో ఉన్న విద్యార్థులు, పాఠకులతో మాట్లాడుతూ గ్రంథాలయపని తీరు, అవశ్యకత, పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్రంథాలయాల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన తీరుకు భిన్నంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి పద్మావతి, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి ఎన్.లలిత, డిప్యూటీ లైబ్రేరియన్ బి.లక్ష్మి, సహాయ గ్రంథాలయ అధికారి కె.శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి దందాల వల్లే పరిశ్రమలు వెనక్కి

టిడిపి నాయకులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

వైసిపి నాయకుల దందాల వల్లే రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు వెనక్కి వెళ్లిపోతున్నాయని టిడిపి విజయనగరం పార్లమెంట్‌స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున విమర్శించారు. శనివారం స్థానిక అశోక్ బంగ్లాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి యువతను జగన్ మోహన్ రెడ్డి మోసం చేశాడని అన్నారు. సుమారు 3లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉంటే నాలుగేళ్ళలో ఒకే ఒకసారి 10,145 ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని, అవి కూడా ఏ మేరకు భర్తీ చేశారో తెలియదని అన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన 17 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తరమివేశారని అన్నారు. తద్వారా 34లక్షల ఉద్యోగాలను ఆంధ్రప్రదేశ్ యువత కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో గంజాయి ప్రోత్సాహం వలన యువత మత్తుకు బానిస అవుతున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ, పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఇకనైనా మోసాలు ఆపి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కంది మురళీనాయుడు, రాజేష్, రొంగలి రామారావు పాల్గొన్నారు.

మోటూరు ఉదయం ఆశయాల కోసం కృషి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మోటూరు ఉదయం ఆశ యాల సాధనకు కృషి చేద్దామని ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ పిలుపునిచ్చారు. ఐద్వా నాయకులు మోటూరు ఉదయం 21వ వర్ధంతి సందర్భంగా సుందరయ్య కాలనీలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉదయం చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం రమణమ్మ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతి కోసం, మహిళలపై జరిగే దాడులకు, మహిళా అణిచి వేతకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని అన్నారు. బుర్ర కథలు వేసి ఊరూరా తిరిగి ప్రజల్ని చైతన్య పరిచారని గుర్తు చేశారు. ఆమె ఆశయ సాధనకు మహిళలంతా కృషి చెయ్యాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.సుజాత. ఎం.పద్మ పాల్గొన్నారు.

పోలీసు, హోంగార్డులకు రుణ సౌకర్యం

ఎస్‌పి దీపిక పాటిల్

ప్రజాశక్తి-విజయనగరం

పోలీసులకు, హోంగార్డులకు కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సొసైటీ సర్వ సభ్య సమావేశం శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉద్యోగులు, హోంగార్డుల అభివృద్ధి, సంక్షేమంలో భాగంగా వారి ఆర్థిక అవసరాలను తీర్చుకొనేందుకు తక్కువ వడ్డీకే రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. ఏటా సొసైటీ పురోగభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందులో వచ్చిన లాభాల నుండి సొసైటీ సభ్యుల పిల్లలను చదువులో ప్రోత్సహించేందుకు ప్రతీ సంవత్సరం స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నామన్నారు. పోలీసు ఉద్యోగులకు మరింత లబ్ధి చేకూర్చడంలో భాగంగా సభ్యుల అంగీకారంతో వ్యక్తిగత రుణాల మంజూరు పరిమితిని మరింతగా పెంచి, వాటిపై వడ్డీ రేటును కూడా 6శాతం నుండి 4.8శాతానికి తగ్గించామన్నారు. సభ్యుల పిల్లల వివాహాలకు ప్రత్యేకంగా రూ. 7లక్షల రుణ సౌకర్యం కల్పించాలని నిర్ణయించామన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన పోలీసు ఉద్యోగుల కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ సభ్యుల పిల్లలకు రూ. 41,500 నగదును స్కాలర్‌షిప్‌లుగా అందజేసారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి ఎంఎం సోల్మన్, ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఎస్‌బి సిఐ రుద్రశేఖర్, ఆర్‌డిలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక

రైల్వేస్టేషన్‌కు చేరుకున్న రైతులు

'చలో ఢిల్లీ'కి తరలివెళ్లిన రైతులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 5న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు విజయనగరం నుంచి రైతులు ఢిల్లీకి శనివారం తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా విధానాలకు నిరసనగా, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆధ్వర్యంలో రైతులు ఢిల్లీకి బయలుదేరారు. రైతులకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యుఎస్ రవికుమార్, సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు అభినందనలు తెలిపారు. అనంతరం రైలు ఎక్కించి రెడ్ సెల్యూట్ చెప్పారు.

బొబ్బిలి : ఈ నెల 5న ప్రజాసంఘాలు చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి రైతులు, స్కీమ్ వర్కర్లు శనివారం పయనమయ్యారు. బొబ్బిలి నుంచి సమత ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీ బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు వారికి అభినందనలు తెలిపారు.

గర్భిణులకు నాణ్యమైన ఆహారం

ప్రజాశక్తి-విజయనగరం

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు, గర్భిణులకు అందిస్తున్న ఆహారం నాణ్యమైనదిగా ఉండాలని బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. శనివారం విజయనగరం ఐసిడిఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధి నవాబ్ పేట అంగన్వాడీ కేంద్రం లో సిడిపిఒ ప్రసన్న ఆధ్వర్యంలో పోషన్ పక్వడాలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను తిలకించారు. బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ చేశారు ఐసిడిఎస్ పీడీ శాంత కుమారి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న పోర్టి ఫైడ్ రైస్‌ను లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లలకు వెల్ బేబీ షో నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ జి.హిమబిందు కార్పొరేటర్ గాదం మురళి, ఎసిడిపిఒ సత్యవతి, సభ్యులు బి.భవాని, పి.సుధారాణి పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యమైతే ఉనికికే ప్రమాదం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వార్షిక ఆదాయంలో ఆఖరి స్థానం. తలసరి ఆదాయమూ అత్యల్పమే. అక్షరాస్యతలో వెనుకబాటు. వీటన్నింటికీ పాలకుల నిర్లక్ష్యమే కారణం. పుష్కలమైన సాగునీటి వనరులు ఉన్నా, అవసరానికి తగట్టు వర్షపాతం నమోదవుతున్నా వాటిని ఒడిసిపట్టి సాగునీటి అవసరాలు తీర్చేందుకు పాలకులు చొరవ, ముందుచూపు లేకపోయింది. దీంతో, జిల్లాలో ఎంతో సారవంతమైన భూములు ఉన్నా వాటిని సాగుచేసేందుకు అవకాశం లేకపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో 2005లో అమల్లోకి వచ్చిన మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం జిల్లా పాలిట ఓ వరమే. ఔను...! మిగిలిన జిల్లాల సంగతి కాస్త పక్కనబెడితే విజయనగరం ఉమ్మడి జిల్లాకు ఈ పథకం మాత్రం బృహత్తర కార్యక్రమమే. కొన్ని దశాబ్ధాల కాలానికి ముందుకెళ్తే ఉమ్మడి రాష్ట్రంలో సైతం ఉమ్మడి విజయనగరం జిల్లాలో అత్యధిక వలస కూలీలు ఉండేవారు. కనీస అవసరాలు తీర్చుకోలేని పేదలెందరో. పాలేర్లుగా ఎక్కువగానే తారసపడుతుండేవారు. ఇటువంటి పరిస్థితుల్లో 2005లో కమ్యూనిస్టుల మద్ధతుతో వచ్చిన యుపిఎ-1 ప్రభుత్వం కనీస ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చింది. ఈ చట్టం ద్వారా ఏటా వంద రోజుల పని గ్యారెంటీ చేశారు. పని కోరుకునేందుకు జాబ్‌కార్డులు జారీచేశారు. కోరిన వెంటనే పని కల్పించాలని, సకాలంలో పని కల్పించకపోతే నష్టపరిహారం కూడా చెల్లించాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. పొట్ట కూటి కోసం ఊరుకాని ఊళ్లు వలసపోయే కుటుంబాలవారికి ఇది ఎంతో ఆసరాగా నిలిచించింది. అంత వరకు ముసలి తల్లిదండ్రులను, చదువుకుంటున్న పిల్లలను వదిలి వలసపోయే భార్యా భర్తలకు కొంతలో కొంతయినా గ్రామంలోనే ఇంటిళ్లపాది కలిసివుండే అవకాశం లభించింది. స్థానికంగానే వంద రోజులు పని గ్యారెంటీ దొరుకుంతుండడంతో గతంతో పోలిస్తే వలసలు తగ్గాయి. సేద్యానికి ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోకపోయినా, పంటలు పెద్దగా కలిసి రాకపోయినా, పండిన పంటలకు పెద్దగా గిట్టుబాటు ధర పలకపోయినా, పెరిగిన ధరల ప్రవాహంలో కొట్టుకుపోయినా ఏడాదిలో వంద రోజుల పని గ్యారెంటీ కావడంతో జిల్లాలో మెజార్టీ ప్రజానీకానికి ఉపాధి చట్టం ఎంతో భరోసా ఇచ్చింది. ప్రస్తుతం విజయనగరం జిల్లాలో 3.51లక్షలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1.68లక్షల చొప్పున మొత్తం ఈ రెండు జిల్లాల్లో 4.19లక్షల జాబ్‌కార్డులు ఉన్నాయి. వీరంతా పని దినాలను పూర్తిస్థాయిలో ఉపయోగించు కుంటున్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఒక్క విజయనగరం జిల్లాలోనే సుమారు రూ.300కోట్ల మేర కూలీలకు సమకూరింది. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోనూ ఇదే స్థాయిలో డబ్బులు చేతికందాయి. ఇందువల్లే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కొంతలో కొంతైనా కళకళాడుతోందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. అంతెందుకు 2020 నుంచి 2021 వరకు సుమారు రెండేళ్లపాటు కరోనా వల్ల విధించిన లాక్‌డౌన్ వల్ల దేశమంతా అతలా కుతలమైనా గ్రామాల్లోని ఉపాధి కూలీలు మాత్రం భద్రంగా బతికేశారు. ఇలా ఈ పథకాన్ని ఉపయోగించడంలో విజయనగరం ఉమ్మడి జిల్లా దేశానికే ఆదర్శంగా నిలిచింది. అందుకే ఇక్కడి జిల్లా కలెక్టర్లకు గవర్నర్‌తో ప్రసంశలు, జాతీయ ఎన్నో అవార్డులు, రివార్డులు సైతం లభించాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి చట్టాన్ని మరింత సమర్ధవంతంగా అమలు చేయాల్సిన కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు శత విధాలా ప్రయత్నం చేస్తోంది. ముఖ్యంగా రెండో సారి అధికారంలోకి వచ్చాక ఉపాధి చట్టానికి వందల రూ.కోట్లు నిధులు కోత విధిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే ఉపాధి పనులకు ఈ ఏడాది రూ.73వేల కోట్లను కుదించింది. ఈ ప్రభావం దేశ వ్యాప్తంగా అన్ని జిల్లాలతోపాటే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలపైనా పడుతుంది. దీని నుంచి దృష్టిమళ్లించేందుకు గత ఏడాది నుంచీ యాప్ ఆధారిత హాజరు అమల్లోకి తీసుకొచ్చింది. రెండు పూటలా పని తప్పనిసరి చేసింది. దీంతో, శ్రమకు తగ్గ ఫలితం దక్కడం లేదు. విజయనగరం జిల్లాలో 2021-22లో ఒక్కపూట పనిచేస్తే కార్మికుడి వేతనం రూ.250 నుంచి రూ.257 అందగా, 2022-23లో రెండు పూటల పనిచేసినా రూ.200కు మించలేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోనూ కూలిరేటు కాస్త అటు ఇటు అయినా వ్యత్యాసం దాదాపు ఇంతే. ఈ రెండు జిల్లాల్లోనూ మునుపెన్నడూ లేనంతగా వేతన బకాయిలు కూడా ఉన్నాయి. వేసవి అలవెన్సులను పూర్తిగా రద్దుచేశారు. పని ప్రదేశాల్లో నీరు, నీడ కల్పించేందుకు చట్టంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ వాటిని అమలు చేయడం లేదు. పనిలో ఉపయోగించే పార, గుణపాం, తట్టలు, గమేలాలు వంటి పనిముట్లకు గతం మాదిరిగా మెయింటెనెన్స్ ఛార్జీలను ఇవ్వడం లేదు. ఉపాధి కూలీలను ఇలా ఇబ్బంది పెట్టడం ద్వారా పని కోరుకునేవారి సంఖ్యను తగ్గించి, సంఖ్య తగ్గింపును బూచిగా చూపించి ఉపాధి చట్టాన్ని పూర్తిగా దూరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తుంది. కేంద్రం తెచ్చిన నిబంధనల వల్ల కండరాలు కరిగిపోతున్నా అందుకు తగ్గ ఫలితం దగ్గడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే జిల్లాలో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే అవకాశం ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వలసలు పోవాల్సిన దుర్భిక్ష పరిస్థితులు ఎదురౌతాయని కూడా తల్లడిల్లుతున్నారు. ఈనేపథ్యంలో కూలీలంతా కేంద్రం కుట్రలపై ఐక్యంగా పోరాడడమే శరణ్యంగా మారింది.



అన్నార్తుల కోసమే ఫుడ్ బ్యాంకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో అన్నార్తుల ఆకలి బాధలు తీర్చేందుకు ఫుడ్ బ్యాంకులు ఎంతగానో దోహదపడుతున్నాయని వైసిపి సోషల్ మీడియా కన్వీనర్ కనకల కృష్ణ అన్నారు. శనివారం సోషల్ మీడియా ప్రతినిధి నవీన్ స్వయంగా అందించిన ఆహారాన్ని కోట వద్ద ఉన్న ఫుడ్ బ్యాంకు ద్వారా పేదలకు పంపిణీ చేశారు.

మధుపాడ ఫీల్డ్‌అసిస్టెంట్‌గా భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-గజపతినగరం

మధుపాడ ఉపాధి హామీ క్షేత్ర సహాయకులుగా కె.భాగ్యలక్ష్మిని నియమించినట్టు ఎపిఒ సిహెచ్ రామారావు తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి బెల్లాన జ్ఞానదీపిక, జెడ్‌పిటిసి గార తవుడు ఆమెకు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె.పైడపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

5న జగ్జీవన్ రామ్ జయంతి

ప్రజాశక్తి-విజయనగరం

దేశ మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 5న నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో ఉదయం 10.30 గంటలకు ప్రభుత్వ ఉత్సవంగా ఈ వేడుకలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని జగ్జీవన్ రామ్‌కు నివాళులు అర్పిస్తారని తెలిపారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ శ్రీదేవి

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఈ నెల మూడో తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంఇఒ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, తహశీల్దార్ కృష్ణంరాజుతో కలిసి పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. వేపాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 208 మంది విద్యార్థులకు 9 గదులు, విక్టరీ పాఠశాలలో 145 మందికి ఎనిమిది గదులు, కెజిపూడి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 75 మందికి ఐదు గదులు కేటాయించినట్లు ఎంఇఒ తెలిపారు. కార్యక్రమంలో వేపాడ హైస్కూల్ హెచ్‌ఎం వల్లి పాల్గొన్నారు.

పది పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం

రామభద్రపురం : ఈ నెల 3 నుంచి నిర్వహించే పదో తరగతి పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేస్తున్నట్లు ఎంఇఒ తిరుమల ప్రసాద్ తెలిపారు. రెండు కేంద్రాల్లో 534 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు.

60 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - జామి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఇందులో జామి పిహెచ్‌సి వైద్యాధికారి భాగ్యరేఖ 60 మందికి పరీక్షలు చేశారు. జ్వర పీడితులను గుర్తించి, మందులు అందజేశారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పరీక్షలు చేశారు.

టిడిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - వంగర

మండలంలోని పెదరాజుల గుమ్మడ గ్రామానికి చెందిన ఆలు బిల్లి అప్పలనాయుడు భార్య సుమలత గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు శనివారం అప్పలనాయుడును మాజీ జెడ్‌పిటిసి బొత్స వాసుదేవరావు నాయుడు, సుప్రీం కోర్ట్ అడ్వకేట్ యలకల రాజగోపాల్ నాయుడు, బెజ్జిపురం త్రినాధరావు, యలకల రమేష్, వావిలపల్లి వంశీ తదితరులు పరామర్శించి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

రాహుల్‌పై కక్ష సాధింపు దుర్మార్గం

ప్రజాశక్తి-బొబ్బిలి

రాహుల్ గాంధీపై కక్షసాధింపు కేసులు పెట్టడం దుర్మార్గమని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముగడ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని తారకరామ కాలనీలో అంబేద్కర్ బొమ్మ వద్ద శనివారం కాంగ్రెస్ ఆధ్వర్యాన సత్యాగ్రహ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి వైఫల్యాలను, అక్రమాలను ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీపై అక్రమంగా కేసులు పెడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, కాంగ్రెస్ నాయకులు మండపాక శ్రీనివాసరావు, వజ్జల శ్రీనివాసరావు, కృష్ణమోహన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహంలో పూర్తిస్థాయిలో సౌకర్యాలు

ప్రజాశక్తి-కొత్తవలస

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బిసి బాలికల వసతిగృహానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి, అన్ని వసతులు కల్పించారు. ఇటీవల గర్ల్స్ హాస్టల్లో 24 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉా శంకర్ ఆధ్వర్యాన డిఇఇ పైడిరాజు, జెఇ ఆర్.సన్యాసిరావు హాస్టల్‌ను పరిశీలించారు. హాస్టల్లో చిన్న చిన్న మరమ్మతులు త్వరగా చేయాలని ఎస్ఇ కింద స్థాయి అధికారులకు సూచించారు. స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఆర్.సన్యాసిరావు మరమ్మతులు చేపట్టి పూర్తి వినియోగంలోకి తీసుకువచ్చారు. రూ.5 లక్షలు నీతి అయోగ్ నిధులతో మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి, పాత్‌వే ఏర్పాటుచేశారు. వంటగది నిర్మాణం చేపట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న మండల కన్వీనర్ మరిపి శంకర్రావు

గృహసారథులు ప్రతి ఇంటినీ సందర్శించాలి

ప్రజాశక్తి-బాడంగి

వాలంటీర్లతో కలిసి గృహసారథులు ప్రతి ఇంటినీ సందర్శించాలని జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకర్‌రావు అన్నారు. శనివారం జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా రేజేరు, ఆనవరం, కోటిపల్లి సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల గురించి, పనితీరు గురించి ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని చెప్పారు. సమస్యలను గుర్తించి, తన దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, ఎంపిపి ప్రతినిధి తెంటు మధుసూదనరావు, వైసిపి నాయకులు కండి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ఎంపి బెల్లాన చంద్ర శేఖర్, ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు అన్నారు. శనివారం వైయస్ఆర్ ఆసరా మూడవ విడత కార్యక్రమంలో భాగంగా నగర పంచాయతీ పరిధిలో 406 స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లో ఉన్న 4,187 మంది సభ్యులకు రూ. 2.49 కోట్లు చెక్కును స్థానిక బైరెడ్డి సూర్య నారాయణ కల్యాణ మండపంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు మరింత ఆర్థికంగా ఎదగడానికి ప్రభుత్వం ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గత ప్రభుత్వాలు డ్వాక్రా సంఘాలను నిర్లక్ష్యం చేశాయని వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తరువాత సంఘాల అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని అన్నారు. ఆసరా పథకాన్ని సద్వినియోగం చేసుకోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్ పర్సన్ బంగారు సరోజినీ, పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, కో ఆప్షన్ సభ్యులు, పట్టణ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, మెప్మా పీడీ బి. సుధాకర్, తహశీల్దారు కె.వి.రమణ రాజు, నగర పంచాయతి కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్‌పి పరామర్శ

గుర్ల : గుర్ల గ్రామ వైసిపి నాయకులు మంత్రి వెంకటరమణ కుటుంబాన్ని ఎమ్‌పి బెల్లాన చంద్ర శేఖర్ శనివారం పరామర్శించారు. ఇటీవల వెంకటరమణ తండ్రి వెంకటప్పుడు అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్‌పి వెంకటరమణ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వెంకటప్పుడు ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట రైల్వే బోర్డ్ సభ్యులు తడేలా ఉమా, ఇజ్జిరోతు ప్రసాద్, ఆచారి, కంకణాల రమణ, గురుమూర్తి, తదితరులున్నారు.

మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న ఎమ్‌పి, ఎమ్మెల్యే

ఇచ్చిన మాట నెరవేర్చాం

బొండపల్లి : మహిళలకు ఎన్నికల ముందు సిఎం జగన్ ఇచ్చిన మాటను నెరవేరుస్తున్నామని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమీపంలోని ప్రయివేటు లేఅవుట్‌లో ఎంపిపి చల్ల చలంనాయుడు అధ్యక్షతన మూడో విడత వైఎస్ఆర్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 1138 సంఘాలకు రూ.7.71 కోట్లు ఆసరా కింద మంజూరైనట్లు చెప్పారు. అమరావతి వట్టి గ్రాఫిక్స్ మాత్రమేనని, పరిపాలనా వికేంద్రీకరణతో అభివృద్ధి సాధ్యమని అన్నారు.

మోడీవన్నీ మాయమాటలే

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ప్రధాని మోడీ చెప్పేవన్నీ మాయమాటలేనని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ వ్యాఖ్యానించారు. మండలంలోని చెరుకు కాటా వద్ద ఆశా, మధ్యాహ్నం భోజన పథకం, గ్రీన్ అంబాసిడర్ల సంఘాల మండల ముఖ్య నాయకులతో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక సంఘాల జిఒల ప్రకారం కూలీలకు వేతనాలు ఇవ్వకుండా వారి నుంచి నిలువునా శ్రమదోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. శ్రమిస్తున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఆయా కుటుంబాలు ఎలా జీవిస్తాయని ప్రశ్నించారు. కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అనంతరం ఈ నెల 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు, సిఐటియు మండల అధ్యక్షులు తరిని వెంకటరమణ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సంఘం మండల నాయకులు పి.దేవి , సంధ్య , దేవుడమ్మ , గ్రీన్ అంబాసిడర్లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియుజిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ

నిరుద్యోగులను మోసగించిన ప్రభుత్వం

మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు

ప్రజాశక్తి-గజపతినగరం

అధికారంలోకి రాగానే 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తానని నిరుద్యోగులను జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు అన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీ ఉంటే నాలుగేళ్లలో ఒకసారి 10,145 ఉద్యోగాలకు జాబ్ కేలండర్ విడుదల చేశారని, అవి కూడా ఏ మేరకు భర్తీ చేశారో తెలియదని అన్నారు. కొత్త పరిశ్రమలు తీసుకురాకపోగా, చంద్రబాబు నాయుడు తీసుకొచ్చిన 17 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను తరిమేశారని చెప్పారు. తద్వారా 34లక్షల ఉద్యోగాలను ఆంధ్రప్రదేశ్ యువత కోల్పోయారన్నారు. కేంద్రమంత్రి నివేదిక ప్రకారం గత మూడేళ్లలో 21,575 మంది యువత ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. వైసిపి నాయకుల దందాల వల్లే పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోతున్నాయని తెలిపారు. గంజాయికి వైసిపి నాయకుల ప్రోత్సాహం వల్ల యువత మత్తుకు బానిస అవుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఉద్యోగాలు, పెట్టుబడులపై శ్వేత పత్రం విడుదల చేయాలని, ఇకనైనా మోసాలు ఆపి ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు.

నేరాల ఆచూకీకి ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నేరాల ఆచూకీ తెలుసుకునేందుకు ఫోరెన్సిక్ ఆధారాలు ఎంతో కీలకమని రాజస్థాన్ రాష్ట్ర ఫోరెన్సిక్ లేబొరేటరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ముఖేష్ శర్మ అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన 'హేండ్స్ ఆన్ ఫోరెన్సిక్ ఫొటోగ్రఫీ' అనే రెండు రోజుల వర్క్ షాపును వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సైన్స్ పదాన్ని విడమరచి చెప్పారు. విద్యార్థులు వృత్తి నైపుణ్యం పెంచుకుంటే ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయన్నారు. ముఖ్య వక్త డాక్టర్ ముఖేష్ శర్మ మాట్లాడుతూ నేరాలు జరిగే ప్రదేశంలో సాక్ష్యాలు ఎలా సేకరించాలో వివరించారు. సాధారణంగా ఫొటోలు తీసే కెమెరాలు ఆండ్రాయిడ్ టెక్నాలజీని వాడుతుంటారని, అదే నేరాల సాక్ష్యాలు సేకరించడానికి ఇండియన్ స్టాండర్డ్ టెక్నాలజీ సాఫ్ట్ వేర్ ఉపయోగిస్తుంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ ఆచార్యులు, విభాగాధిపతి డాక్టర్ నాగజోగయ్య, భువనేశ్వర్, ఎపి క్యాంపస్‌ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఎంఇఒ

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని సంకిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని ఎంఇఒ వరప్రసాదరావు శనివారం పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, టాయిలెట్, విద్యుత్ వంటి సదుపాయాలపై ప్రధానోపాధ్యాయులు చల్ల లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. మాల్ ప్రాక్టీస్ లేకుండా ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంకు సూచించారు. సంకిలితో పాటు లక్ష్మీపురం, రేగిడి, అంబాడ వెంకటాపురం 10వ తరగతి పరీక్ష కేంద్రాలకు 664 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సంకిలి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం వండి పెట్టాలని ఎంఇఒ సూచించారు. ప్రధానోపాధ్యాయులు జి. పద్మ, సహోపాధ్యాయులు చంద్రకళ, సిఆర్‌పి కెంబూరు వెంకటరమణ ఉన్నారు.

యువత పాత్రే కీలకం : సిటియు విసి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమసమాజ నిర్మాణంలో యువత పాత్రే కీలకమని కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తేజస్వి కట్టమణి తెలిపారు. ఆజాదికా అమృత్ మహోత్సవాన్ని పురస్కరించుకొని వివేకానంద ఫర్ కల్చర్ యోగా అండ్ మేనేజ్‌మెంట్ సహకారంతో సివిల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం సిటియులో వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కట్టమణి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ హక్కుల గురించి మాట్లాడటమే కాకుండా బాధ్యతలను కూడా నిబద్ధతతో నిర్వహించాలని కోరారు. అనంతరం విద్యార్థులు వసుధైక కుటుంబం (యూనివర్సల్ ఫామిలీ) సాధనకు వివిధ సలహాలు, సూచనలతో కూడిన ప్రజెంటేషన్స్ ఇచ్చారు. డాక్టర్ కుసుమ్ సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమానికి అరుణాచల్ ప్రదేశ్ వివేకానంద కేంద్ర జీవనవర్తి కార్యకర్త లక్ష్మీనారాయణ, సుజాత, వివేకానంద ఫర్ కల్చర్ యోగా అండ్ మేనేజ్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకర్త రవి, ప్రొఫెసర్ మిశ్రా, ప్రొఫెసర్ శరత్ చంద్రబాబు, ప్రొఫెసర్ శ్రీనివాసన్, డాక్టర్ అప్పాసాభా తదితరులు పాల్గొన్నారు.

నిర్లిప్తత వద్దు.. చర్యలు చేపట్టండి

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి

ప్రజాశక్తి - గుర్ల

బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పనిచేసి పూర్తిస్థాయిలో అదుపు చేయాలని, పనిలో నిర్లిప్తత వద్దని, చర్యలు చేపట్టాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. అధికారులు ఉదాసీనంగా ఉండటం వల్ల బాల్య వివాహాల నిర్మూలన అమల్లో విఫలమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మహిళ శిశుఅభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాలలో బాల్య వివాహాలు జరిగకుండా మహిళ పోలీసులు, విఆర్ఒలు, అంగన్వాడీ కార్యకర్తలు అడ్డుకోవాలన్నారు. బాలల సంక్షేమ సమితి చైర్ పర్సన్ డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ బాల్య వివాహాలకు మూల కారణాలను విశ్లేషించుకోవాలన్నారు. ఐసిడిఎస్ పీడీ శాంతకుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలపై మరింత అవగాహన రావాలన్నారు. డిసిపిఒ సత్యనారాయణ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు గురించి వివరించారు. జెడ్‌పిటిసి ఎస్. అప్పలనాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించడం ద్వారా మరింత అవగాహన కల్పించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కళ్యాణి, సిడిపిఒ ఆరుద్ర, డిటి సూర్య నారాయణ, ఎస్‌బిసిసి జిల్లా కోఆర్డినేటర్ బి.రామకృష్ణ, వైస్ ఎంపిపి టి.తిరుపతిరావు, అంగన్వాడీ సూపర్వైజర్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని మోపాడ గ్రామంలో శనివారం 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జెసియస్ మండల ఇన్‌ఛార్జి, సచివాలయం కన్వీనర్లతో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సమీక్షా సమావేశం నిర్వహించి, విధి విధానాలు వివరించారు. అనంతరం కన్వీనర్లకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి- డెంకాడ

ఆధునిక సాంకేతికతపై అభిరుచితోనే అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోవచ్చునని వైజాగ్ స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ పార్థసారథి ఘోష్ అన్నారు. జొన్నాడ వద్ద లెండి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం మెకానికల్ విభాగ యువజనోత్సవం విదాత్రి- 2023ను ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్జెక్టుపై స్పష్టమైన దృష్టి, సృజనాత్మకత పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భం గా త్రిడి ప్రింటింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామారెడ్డి మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీర్స్ ఎప్పటికప్పుడు సాంకేతికను అంది పుచ్చుకుంటే కెరీర్ అద్భుతంగా ఉంటుందన్నారు. మంచి ప్రవర్తన చిత్తశుద్ధితో సాధన చాలా ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎన్. దీప్లా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా సాధించాలంటే నేర్చుకోవాలనే తపన, నాయకత్వ లక్షణాలు, భావ వ్యక్తీకరణ చాలా ముఖ్యమని అన్నారు. విభాగాధిపతి డాక్టర్ సతీష్ పూజారి మాట్లాడుతూ రోబోటిక్స్, ప్రోడక్ట్ డిజైన్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, 3డి ప్రింటింగ్, ఆటోమొబైల్ ముఖ్యంగా ఎలక్ట్రికల్ వెహికల్స్ రంగంలో ప్రస్తుతం మంచి కొలువులు స్వాగతం పలుకుతున్నాయన్నారు. అనంతరం పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్ పోటీలను నిర్వహించారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఈ కార్యక్రమాలలో పాల్గొంన్నారు. ప్రెజెంటేషన్స్‌లలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు తమ్మినేని, ఎవి పరాంకుశం, ప్లేస్ మెంట్ డీన్ జి ప్రకాష్ బాబు, అన్ని విభాగాల అధిపతులు డాక్టర్ రాజన్ బాబు, డాక్టర్ రామారావు, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ సుబ్బరామయ్య, డాక్టర్ దుర్గా శైలజ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ జిఎం పార్థసారధి, ఎజిఎం దీప్లా నాయక్

ఐసిడిఎస్‌ను యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక ఐసిడిఎస్ ప్రాజక్టు కార్యాలయాన్ని నెల్లిమర్లలోనే యథావిధిగా కొనసాగించాలని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టి.వి. రమణ డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్ వాడీలు నెల్లిమర్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎత్తివేత ఆపాలని యథావిధిగా కొనసాగించాలని కోరుతూ నగర పంచాయతి ఛైర్‌పర్సన్ బంగారు సరోజినీ, కో ఆప్షన్ సభ్యులు చిక్కాల సాంబ శివరావు, వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2002లో నెల్లిమర్ల, గుర్ల మండలాలను కలిపి ఐసిడిఎస్ ప్రాజక్టు కార్యాలయాన్ని నెల్లిమర్లలో ఏర్పాటు చేయడం వల్ల రెండు మండలాలకు అందుబాటులో ఉండేదన్నారు. అలాంటి ప్రాజెక్టుని ఎత్తివేసి నెల్లిమర్లను విజయనగరం అర్బన్ లోకి, గుర్ల, గరివిడి మండలాలను కలిపి కొత్త ప్రాజెక్టు ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. జిల్లా కేంద్రంలోని అర్బన్ ప్రాజెక్టు అయ్యన్న పేటకు 2కిలో మీటర్లు దూరంలో ఉండడం వల్ల నెల్లి మర్లలోని కొన్ని గ్రామాల 30, నుంచి 35కిలోమీటర్లు దూరంలో ఉన్నాయని ఆ గ్రామాలకు చెందిన ప్రజలు అంగన్ వాడి సిబ్బంది ఇబ్బందులు పడతారని చెప్పారు. నెల్లిమర్ల ప్రాజెక్టుని అర్బన్‌లో కలపడం వల్ల ఉపయోగం లేదన్నారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, అంగన్ వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నెల్లిమర్ల ప్రాజెక్ట్ అధ్యక్షులు పి. మంగ లక్ష్మీ, ప్రధాన కార్యదర్శి సరళ, నాయకులు పి. దుర్గా భవాని, ఆర్.జయ మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అవంతిలో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి- గరివిడి

స్థానిక అవంతి ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం డిప్లొమా అండ్ బి.టెక్ ఫైనల్ ఇయర్ ఏంఈసిహెచ్ అండ్ ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులకు టీవీఎస్ గ్రూప్‌కు చెందిన ప్రముఖ మెకానికల్, ఎలక్ట్రికల్ ' కోర్ కంపెనీ' 'వీల్స్ ఇండియా లిమిటెడ్' చెన్నై, హెచ్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ ఎ.దివాకర్ ఆధ్వర్యంలో ప్రాంగణ ఎంపికలు జరిగాయి. ఈ ప్రాంగణ ఎంపికలకు అవంతి విద్యాసంస్థలు, ఇతర కాలేజీలు, గరివిడి కాలేజీ నుండి 256 మంది విద్యార్థులు హాజరయ్యారు. కంపెనీ హెచ్‌ఆర్ డిప్యూటీ మేనేజర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రాత పరీక్ష, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ వంటి ప్రతిభ పరీక్షలు నిర్వహించి 61 మందిని ఎంపిక చేసి జాయినింగ్ ఆర్డర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వి. జాషువ జయప్రసాద్ వైస్ ప్రిన్సిపాల్ బి. వెంకటరమణ, ఏ.ఓ జి.అనిల్ కుమార్, కాలేజీ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ ఎన్.చంద్రశేఖర్, ఎమ్.మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

వేపాడ : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరవుతున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, గృహ సారథులు, వాలంటీర్లు హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో శంకుస్థాపన వారోత్సవాలలో భాగంగా శనివారం రూ.60.38 లక్షలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. 38వ డివిజన్‌లోని బొబ్బాదిపేట, 40వ డివిజన్‌లో రహదారులు, కాలువలు, 41వ డివిజన్లో సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా 40, 41 డివిజన్ల కార్పొరేటర్లు బి.ధనలక్ష్మి, సుంకర నారాయణ స్వామి మాట్లాడారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, 38వ డివిజన్ కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, నాయకులు నారాయణప్పుడు, నగరపాలక సంస్థ ఇఇ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్ట్‌ను పరిశీలిస్తున్న డిఆర్‌డిఎ పీడీ కల్యాణ చక్రవర్తి

మహిళా మార్ట్‌ను సందర్శించిన పీడీ

ప్రజాశక్తి-గరివిడి

పట్టణంలోని జెడ్‌పిటిసి వాకాడ శ్రీనివాసరావు షాపింగ్ కాంప్లెక్స్‌లో చేయూత మహిళా మార్ట్‌ను డిఆర్‌డి పీడీ ఎ. కళ్యాణ్ చక్రవర్తి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. మార్ట్‌లో గల సరుకులును, నాణ్యతను పరిశీలించి మహిళలకు, సిబ్బందికి తగు సూచనలు చేశారు. సరుకులను ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేస్తున్నారో పరిశీలించారు. సరుకుల నాణ్యతలో ఎటువంటి రాజీ లేకుండా మహిళలు అందరికీ అవగాహన కల్పించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిడి కె. సావిత్రి, డిపిఎం చేయూత రవికుమార్, ఏరియా కో ఆర్డినేటర్ జి.సీతారామయ్య, ఏపిఎంలు ఎల్.పద్మ, ధనలక్ష్మి, మార్ట్ అధ్యక్షురాలు ఎం.పద్మ పాల్గొన్నారు.

వసతి గృహాన్ని సందర్శించిన ఇంగ్లాండ్ ప్రతినిధులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కోనాడ జంక్షన్ వద్ద గల క్యాంపస్ ఛాలెంజ్ వికలాంగుల వసతి గృహాన్ని యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ మిస్టర్ గారెత్ విన్ ఓవెన్ తన బృందంతో శనివారం సందర్శించారు. హెచ్‌ఎంఎస్ తమర్ పి-233 యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన యుద్ధ నౌక విశాఖపట్నం పోర్ట్‌ని సందర్శించడానికి వచ్చింది. ఇందులో భాగంగా దానిలో గల క్రూ సభ్యులు, బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్‌తో ఇక్కడకు వచ్చారు. పిల్లల పాఠశాల, మెడికల్ కేర్ సదుపాయాలను పరిశీలించారు. పిల్లల నివాస సముదాయాలను పెయింటింగ్ వేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోరుకొండ సైనిక్ స్కూల్ పూర్వ విద్యార్థులు జిర్‌సి బోస్, డిఎస్ రాజు, కమాండర్ లక్ష్మణరావు, క్యాంపస్ ఛాలెంజ్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో 'ఆప్ బడో దేశ్ కో బడో'

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం రోటరీ క్లబ్, జిల్లా యంత్రాంగం, లీడ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెల్లిమర్ల డైట్ శిక్షణాలయంలో 'ఆప్ బడో దేశ్ కో బడో' అనే నినాదంతో యువతకు 6 రోజుల పాటు జరగనున్న శిక్షణా కార్యక్రమాన్ని శనివారం లీడ్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు సుదర్శన ఆచార్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 మంది విద్యార్థులు పాల్గొని ఇక్కడ శిక్షణ పొందుతారన్నారు. తాము అభివృద్ధి పొందుతూ దేశాన్ని అభివృద్ధి పరచే దిశగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని కోరారు. డైట్ ప్రిన్సిపల్ తిరుపతి నాయుడు అధక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లీడ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వర రావు, రోటరీ బ్లడ్ బ్యాంక్ అధ్యక్షులు బాలాజీ, రోటరీ క్లబ్ విజయనగరం అధ్యక్ష, కార్యదర్శులు ఉమా బాలాజీ, సూర్యలక్ష్మి, రోటేరియన్లు సుబ్బరాజు, రాధికా రాణి, కుమార్, సత్యం, శ్రీరామమూర్తి, శ్రీకాంత్, లీడ్ ఇండియా ప్రతినిధులు జ్ఞానేశ్వర్, సుబ్రహ్మణ్యం తదతరులు పాల్గొన్నారు.